నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
23-09-2025
పేజీలు: 02



## దుల్కర్, పృథ్వీరాజ్ ఇళ్లలో కస్టమ్స్ సోదాలు..

లగ్జరీ కార్ల స్మగ్లింగ్ ఆరోపణలకు సంబంధించి సినీ హీరోలు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసాల్లో కస్టమ్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆపరేషన్ నమకూర్ పేరుతో దేశవ్యాప్తంగా లగ్జరీ కార్ల స్మగ్లింగ్‌పై దర్యాప్తు చేపట్టిన కస్టమ్స్, ఇందులో భాగంగానే కోచిలోని ఈ ఇద్దరు ప్రముఖుల ఇళ్లలో సోదాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లగ్జరీ కార్ల దిగుమతిలో అక్రమాలు, పన్ను ఎగవేతలకు పాల్పడినట్లుగా కస్టమ్స్ అధికారులు అనుమానిస్తున్నారు.



## నవరాత్రుల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

పవిత్రమైన నవరాత్రులను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మహిళలకు శుభవార్త అందించింది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా మరో 25 లక్షల కొత్త ఎల్పీజీ కనెక్షన్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో దేశంలో మొత్తం ఉజ్వల లబ్ధిదారుల సంఖ్య 10.60 కోట్లకు చేరుకోనుంది. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సోమవారం తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా వెల్లడించారు. పండుగ సీజన్‌లో పేద కుటుంబాలకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసే ప్రతి కొత్త ఉచిత కనెక్షన్ కోసం సుమారు రూ. 2,050 ఖర్చు చేయనుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి హర్దీప్ సింగ్ పూరీ మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ ఎల్లప్పుడూ మహిళల గౌరవానికి, సాధికారతకు పెద్దపీట వేస్తారు. దుర్గాదేవిని పూజించే ఈ శుభ సమయంలో 25 లక్షల కొత్త ఉజ్వల కనెక్షన్లు ఇవ్వడం మహిళల పట్ల ఆయనకున్న గౌరవానికి మరో నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## కృష్ణా జలాల వివాదం..
# ఆల్మట్టి డ్యామ్‌పై తెలంగాణ గట్టి నిరసన

కృష్ణా నది జలాల అలాట్‌మెంట్‌పై ఢిల్లీలో కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్-II (KWDT-II) ముందు తెలంగాణ ప్రభుత్వం తన వాదనలు బలపడి వినిపిస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాను కాపాడుకోవడానికి ఎటువంటి రాజీ లేదని స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో ట్రిబ్యునల్ వాయిదా ముందు సోమవారం (సెప్టెంబర్ 22) తమ లీగల్ టీమ్‌తో కలిసి వాదనలు సిద్ధం చేస్తూ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల మధ్య జలాల విభజనలో తెలంగాణ హక్కులను రక్షించుకోవాలని నొక్కి చెప్పారు. ఈ వివాదం రాష్ట్ర వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 27.4 లక్ష ఎకరాలకు పెరిగే ప్రభావాన్ని చూపిస్తోంది. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519 అడుగుల నుంచి 524.25 అడుగులకు పెంచాలనే ప్రతిపాదనకు తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ పెంపు ద్వారా కర్ణాటకకు 200 TMC జలాశయ సామర్థ్యం పెరిగి, తెలంగాణకు 100-130 TMC జలాలు తగ్గిపోతాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. 2017 నుంచి సుప్రీంకోర్టులో వాయిదా పడిన ఈ కేసులో తెలంగాణ లీగల్ టీమ్ సీనియర్ అడ్వకేట్ల సహాయంతో గట్టి వాదనలు చేస్తామని, డ్యామ్ ఎత్తు పెంపును అడ్డుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై గట్టి సూచనలు



ఇచ్చి, తెలంగాణ రైతుల హక్కులను కాపాడుకోవడానికి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు. ఈ పోరాటం రాష్ట్ర వ్యవసాయ భవిష్యత్తును నిర్ధారిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి హైలైట్ చేశారు.

కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణ వాటా విషయంలో ఎటువంటి రాజీ లేదని మంత్రి స్పష్టం చేశారు. మొత్తం 811 TMC కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 512 TMC, తెలంగాణకు కేవలం 299 TMC మాత్రమే కేటాయించడం అన్యాయమని, ఇది KWDT-IIలో ప్రస్తావించి పోరాడుతున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మునుపటి BRS ప్రభుత్వం ఈ అసమాన అలాట్‌మెంట్‌కు ఆమోదం తెలుపడంతో రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం 500 TMC వాటా కోసం గట్టిగా పోరాడుతోందని చెప్పారు. కలేశ్వరం ప్రాజెక్ట్ వంటి మునుపటి పోటీల్లో జరిగిన లోపాల నుంచి పాఠాలు నేర్చుకుని, ప్రాణహిత-చెవెల్ల వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ వివాదంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మారినా తెలంగాణ హక్కులు కాపాడుకోవడానికి రాజీలేని పోరాటం చేస్తామని ధైర్యంగా ప్రకటించారు. ఈ జల వివాదం తెలంగాణ రైతుల జీవనాధారాన్ని ప్రభావితం చేస్తోంది, ముఖ్యంగా లేత వర్షాకాలాల్లో జల సంక్షోభానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. BRS పార్టీ నాయకులు కేటీఆర్, కె. కవిత వంటి వారు కూడా ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనాన్ని విమర్శిస్తూ, సుప్రీంకోర్టులో కాంటెంప్ట్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తెలంగాణకు విపత్తును తీసుకురావచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఈ పోరాటాన్ని బలోపేతం చేస్తూ, రాష్ట్ర భవిష్యత్తు జల భద్రతను నిర్ధారించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నిర్ణయాలు కీలకమవుతాయని భావిస్తున్నారు.



## ఫీజు రీయింబర్స్మెంట్‌పై వైసీపీకి లోకేశ్ సవాల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై శాసనమండలిలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మండలి ఛైర్మన్ తిరస్కరించిన వాయిదా తీర్మానానికి మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. శాసన మండలిలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. తీర్మానాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. అయినా చర్చ జరగాలని వైసీపీ పట్టుబట్టింది. దీంతో సమాధానం ఇచ్చేందుకు తాము సిద్ధమని లోకేశ్ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం రూ. 4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టిందని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. ఇప్పుడు బకాయిలపై వాయిదా తీర్మానం అడగటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో బొత్స సత్యనారాయణ విద్యాశాఖ మంత్రిగా ఉండి.. రూ. 4 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. చర్చలు కొనసాగుతున్నప్పుడు మధ్యలో ఛైర్మన్ కలగచేసుకున్నారు. తిరస్కరించిన వాయిదా తీర్మానంపై సభ్యుల వాదులాట సరికాదని ఛైర్మన్ విస్మయం చెందారు.



## జూరాలకు భారీగా వరద.. 42 గేట్లు ఎత్తివేత

జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు (Jurala Project) భారీగా వరద వస్తున్నది. ఎగువన వర్షాలు, జలాశయాల నుంచి నీటిని విడుదల చేయడంతో జూరాలకు 3.42 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో అధికారులు 42 గేట్లు ఎత్తి 3.16 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లు. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు. ప్రస్తుతం 8.790 టీఎంసీలు ఉన్నది. ఇక శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద కొనసాగుతున్నది. ప్రాజెక్టుకు 3లక్షల57 వేల 333 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు 10 గేట్లను 5 అడుగుల మేర, 16 గేట్లను 10 అగుడుల మేర ఎత్తి అతే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ, కుడి విద్యుత్ ప్లాంట్లలో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.70 అడుగులు ఉన్నది. ప్రాజెక్టులో మొత్తం 312 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 303.94 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

## రేషన్ డీలర్ల కమీషన్ బకాయిలపై హరీశ్ రావు ఆగ్రహం..
# ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ధ్వజం

మాజీ మంత్రి హరీశ్ రావు రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లింపులు ఆలస్యం కావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రేషన్ డీలర్లతో సమావేశమైన ఆయన, వారి సమస్యలను ఆలకించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా రేషన్ డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఆహార భద్రత కల్పించే ఈ వ్యవస్థలో డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి జీవనోపాధిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. రేషన్ డీలర్లు నెలల తరబడి కమీషన్ చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారని, ఇది వారి జీవితాలను దిగమింగేలా చేస్తోందని హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్, బిజేపీ ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆయన తీవ్ర శబ్దాల్లో దుయ్యబట్టారు. రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ పేదల ఆకలిని తీర్చే డీలర్లను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఈ పరిస్థితి వారిని పస్తులుండేలా చేస్తోందని, ఇది శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు



తమ బాధ్యతను విస్మరిస్తూ, రేషన్ డీలర్లను ఆర్థిక ఇబ్బందుల్లో ముంచెత్తడం సమంజసం కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. రేషన్ వ్యవస్థ పేదలకు ఆధారమైన వ్యవస్థ కాగా, దాని నిర్వహణలో కీలకమైన డీలర్లను గౌరవించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కమీషన్ బకాయిలను వెంటనే చెల్లించి, డీలర్లకు ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమస్యను విస్మరిస్తే, రేషన్ వ్యవస్థ మొత్తం కుప్పకూలే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.



## గర్భిణీ స్త్రీలు ఆ డ్రగ్ వాడొద్దు: డోనాల్డ్ ట్రంప్

గర్భిణీ స్త్రీలు పెయిన్ కిల్లర్ టైలినాల్ వాడవద్దు అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టైలినాల్ వాడకం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. టైలినాల్ వల్లే అమెరికాలో ఆటిజం కేసులు పెరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. టైలినాల్‌కు, ఆటిజంకు లింకు ఉన్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నా.. ఆ అంశంపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సోమవారం వైట్‌హౌజ్ నుంచి ఆయన ప్రసంగించారు. మహిళలు అసిటమినోఫిన్ డ్రగ్‌ను వాడవద్దు అని ట్రంప్ పేర్కొన్నారు. టైలినాల్ బ్రాండ్ పేరుతో అమ్మే ఆ మందును ప్రెగ్నెన్సీ సమయంలో పూర్తిగా వాడకూడదని ఆయన తెలిపారు. వ్యాక్సిన్ల పట్ల కూడా ట్రంప్ కొంత ఆందోళన వ్యక్తం చేశారు.



## లో దుస్తుల్లో బోల్డ్‌గా జినాల్ జోషి

ముంబై బ్యూటీలకు ఇండస్ట్రీలో చాలా డిమాండ్ ఉంటుంది. సినిమా ఛాన్సులు రాకపోతేనేం... సోషల్ మీడియాలో దూసుకుపోతారు. జినాల్ జోషీ కూడా అలాంటిదే. అమ్మడు ఎక్కడా వెనక్కి తగ్గదు.ముంబైలోనే పుట్టి పెరిగిన ఈ భామ... అనుపమ్ ఖేర్ దగ్గర యాక్టింగ్ నేర్చుకుంది. డిప్లొమా పూర్తి చేసింది. కానీ సినిమా ఛాన్సులు మాత్రం దక్కించుకోలేకపోయింది. తనకు డ్రింకింగ్, స్మోకింగ్ అలవాట్లు లేవంటున్న ఈ బ్యూటీ... అందాల ఆరబోతలో మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గట్లేదు. ఆఫర్ల కోసమో... ఫ్యాన్ ఫాలోయింగ్ కోసమో గానీ... ఎరోటిక్ లుకింగ్ స్టైల్ మోడలింగ్ చేస్తూ... యూత్‌ని ఎట్రాక్ట్ చేస్తోంది. థియేటర్ డ్రామాల్లో నటించి మెప్పించిన జినాల్... బాలీవుడ్ ఎప్పుడు పిలుస్తుందా అని ఎదురుచూస్తోంది.సినిమా ఛాన్సులు రాకపోతేనేం... నైకా సహా చాలా ఫ్యాషన్ బ్రాండులకు యాడ్స్ చేస్తూ... రెండు చేతులా సంపాదిస్తోంది.ఐదున్నర అడుగుల ఈ బ్యూటీ... ముంబై యూనివర్శిటీలో మాస్ మీడియాలో గ్రాడ్యుయేషన్ కూడా చేసింది.

EVENING EDITION
మంగళవారం | 23 సెప్టెంబర్ 2025 4PM
www.suryaa.com
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక.. పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి)మండలం మంగలి తండాకు చెందిన రైతు ధరావత్ పంతులు(52) ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఇల్లందు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడనుంచి ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. దీంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య హంసాలి, కుమారుడు రాజశేఖర్, కుమార్తె మంగమ్మ ఉన్నారు. మృతుని భార్య హంసలి ఫిర్యాదుతో కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## పారిపోదామని.. విమాన టైర్‌లో కూర్చున్నాడు

అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్ నుంచి ఢిల్లీకి విమాన టైర్‌లో కూర్చొని ప్రయాణించాడు ఓ 13 ఏళ్ల బాలుడు. దాదాపు గంటన్నర సేపు విమాన టైర్‌లో అతడు దాక్కున్నాడు. ఎంతో అదృష్టంతో చావును జయించి మృత్యుంజయుడు అయ్యాడు. కాబూల్‌కు చెందిన బాలుడు ఇరాన్ పారిపోదామనే ఉద్ధేశంతో పొరపాటున ఢిల్లీ విమానం ఎక్కాడు. టికెట్, పాస్‌పోర్టు టైర్‌లో దాక్కున్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యాక అధికారులకు విషయం తెలిసింది. దీంతో సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విమానం టైర్లతో పాటు బాలుడు కూడా లోపలికి వెళ్లి దాక్కుని ఉంటాడని.. అందుకే అతడు ప్రాణాలతో బయటపడగలిగాడని అధికారులు వివరించారు. లేదంటే 30 వేల అడుగుల ఎత్తులో ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయే వాడని తెలిపారు.

## సింగరేణి కార్మికులు 34 శాతం బోనస్




సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటాలు పంచాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము తీసుకున్న నిర్ణయం వల్ల మొత్తం 71 వేల మంది సింగరేణి కార్మికులకు మేలు జరుగుతుందని సిఎం రేవంత్ తెలిపారు. 41 వేల పర్మినెంట్ ఉద్యోగులకు రూ.1,95,610లు, 30 వేల కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500ల వాటా అందుతుందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు ఇప్పటికే దసరా అడ్వాన్స్‌గా రూ.25 వేలు ఇచ్చామని సిఎం రేవంత్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతో కలిసి సింగరేణి కార్మికులకు దసరా బోనస్ ప్రకటించారు. సింగరేణి 2024,-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో కార్మికులకు ప్రభుత్వం వాటా ప్రకటించింది. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా సింగరేణిని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పోరాటాన్ని చరిత్ర ఎప్పటికీ మరువదని, రాష్ట్ర సాధన ప్రక్రియలో ప్రత్యేక పాత్ర పోషించిన సింగరేణి కార్మికులను తమ పార్టీ, ప్రభుత్వం ఎప్పటికీ గుర్తిస్తూనే ఉంటుందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



## తెలంగాణ మాల్దీవులు' చూసారా? హైదరాబాద్ నుంచి కేవలం కొన్ని గంటల దూరంలో!


స్కూల్‌లకు దసరా సెలవులు మొదలయ్యాయి. మరో రెండు రోజుల్లో కాలేజీలకు కూడా హాలీడేస్ రాబోతోన్నాయి. ఇకపై, గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని నదులు, సరస్సులు నిండిపోతున్నాయి.జలపాతాలు జలకళను పూయగా, తాజా సుందరంగా లక్నవరం సరస్సు పర్యాటకులను ఆకర్షిస్తోంది. వరంగల్ నుంచి కేవలం 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ సరస్సు అందాలను తనివితీరా ఎంజాయ్ చేసేందుకు ప్రజలు తరలివస్తున్నారు.చుట్టూ కొండలు, చెట్లు, వంతెన కింద ప్రవహిస్తున్న నీళ్లు- - - వీటిని చూస్తే మనకు కోనసీమ, అరకు, కేరళని అనిపిస్తుంది. ప్రస్తుతం ములుగు జిల్లా లక్నవరం సరస్సు పర్యాటకులకు స్వర్గధామంగా మారింది. జోరు వానల వల్ల సరస్సులోకి భారీగా వరద నీరు వస్తోంది. వీకెండ్స్‌లో, హైదరాబాద్ నుంచి కుటుంబ సమేతంగా పర్యాటకులు సరస్సు అందాలను తిలకిస్తూ, బోటింగ్, ఇతర ఫన్నీ ఆక్టివిటీలను ఆనందంగా ఆస్వాదిస్తున్నారు.చుట్టూ కొండల మధ్య, హరిత రిసార్ట్స్, ఇతర సదుపాయాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి ములుగు జిల్లాలోని లక్నవరం జలాశయానికి 219 కిలోమీటర్ల దూరం, సుమారు 4 గంటల్లో చేరుకోవచ్చు.

## సుప్రీంకోర్టుకు చేరిన తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసు



తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలకు సంబంధించిన కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసును విచారిస్తున్న సీబీఐ దర్యాప్తు అధికారి నియామకంపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కేంద్ర దర్యాప్తు సంస్థ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఈ నెల 26న విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. లడ్డూ నెయ్యి కల్తీ ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది. ఈ బృందంలోని దర్యాప్తు అధికారి వెంకట్రావు, విచారణలో భాగంగా చిన్నప్పన్న అనే వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. అయితే, ఆ నోటీసులను సవాల్ చేస్తూ చిన్నప్పన్న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు, సిట్‌లో వెంకట్రావు నియామకం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా లేదని పేర్కొంది. అందువల్ల, ఆయన దర్యాప్తును కొనసాగించరాదని ఆదేశాలు జారీ చేసింది.హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సీబీఐ డైరెక్టర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ సోమవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఈ కేసు విచారణను వాయిదా వేయాలని కోరారు. తమ వాదనలు వినిపించేందుకు ఈ నెల 26న అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ అభ్యర్థనను అంగీకరించిన ధర్మాసనం, కేసును ఈ నెల 26న విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తుందా లేక కొట్టివేస్తుందా అనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## యువరాణిలా మెరిసిపోతున్న రుక్మిణి వసంత్



కాంతార' సినిమాలో కన్నడ బ్యూటీ సప్తమి గౌడ హీరోయిన్ గా నటించింది. ఈ సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు తెచ్చుకుందీ అందాల తార. ఇప్పుడు తెలుగుతో పాటు పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంటోంది సప్తమి గౌడ. ఇదిలా ఉంటే కాంతార సినిమాకు ప్రీక్వెల్ గా తెరకెక్కుతోన్న 'కాంతార: చాప్టర్ 1' లో హీరోయిన్ ఎవరో ఇప్పటివరకు వెల్లడించలేదు మేకర్స్. ఇప్పుడు ఈ విషయంపై చిత్ర బృందం నుంచి అధికారిక అప్‌డేట్ వచ్చింది. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని కాంతార 2 నుంచి కనకవతి పాత్ర పోస్టర్ విడుదలైంది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంటోన్న రుక్మిణి వసంత్ ఈ పాత్రను పోషిస్తోంది. 'కాంతార: చాప్టర్ 1 విడుదలకు కొన్ని నెలలే మిగిలి ఉంది. అందుకే, ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రమోట్ చేయడానికి చిత్ర బృందం సిద్ధంగా ఉంది.





## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఆ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగి లింది. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా (63), కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోస దాదా (37) మృతి చెందినట్లు నారాయణపూర్ పోలీసులు ధృవీకరించారు. 40 లక్షల రూపాయల చొప్పున రివార్డు ఉన్న ఈ ఇద్దరు తెలుగు మావోయిస్టులు స్వస్థలం కరీంనగర్ జిల్లా అని వివ రించారు. ఘటనాస్థలి నుంచి పోలీసులు ఎకె 47 తుపాకీ, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక గ్రనేడ్ లాంఛర్, మావోయి స్టు సాహిత్యం, ప్రచార సామగ్రి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను నిర్వ హిస్తున్న 'దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ'లో మూడు దశాబ్దాలకు పైగా చురుకుగా పాల్గొన్నారన్నారు. బస్తర్‌లో జరిగిన అనేక హింసాత్మక సంఘటనలకు వారు సూత్ర ధారులని ఎస్‌పి వెల్లడించారు .'రాజు దాదాను గుడ్సా ఉసేండి, విజయ్, వికల్ప్ అనే మారుపేర్లతో కూడా పిలుస్తారు, అయితే కోసా దాదాను గోపన్న, బుచ్చన్న అని కూడా పిలుస్తారు. ఛత్తీస్‌గఢ్‌లో వారి తలలపై ఒక్కొక్కరికి రూ. 40 లక్షల రివార్డులు ఉన్నాయి' అని చెప్పారు.

## అది ఫేక్ వీడియో.. నిజం తెలుసుకోకుండా ఎలా ప్రసారం చేస్తారు: అక్షయ్



కృత్రిమ మేధ (ఎఐ) అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఏది అసలో, ఏది నకిలీయో తెలుసుకోవడం కష్టంగా మారిపోంది. చాలా మంది సెలబ్రిటీలు ఈ ఎఐ టెక్నాలజీ వల్ల ఇబ్బందులు ఎదురుకున్నారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఈ ఎఐ బారీన పడ్డారు. అక్షయ్ కుమార్‌కు సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఆయన స్వయంగా అక్షయ్ స్పందించారు. తాను మహర్షి వాల్మీకి అనే పాత్ర చేయడం లేదని.. ఆ పాత్రకు సంబంధించిన ట్రైలర్ యూట్యూబ్‌లో కూడా ఈ వీడియో వైరల్‌గా మారిందని అక్షయ్ అన్నారు. ''అది ఎఐతో చేసి ఫేక్ వీడియో అలాంటి వాటిని నమ్మకండి. అన్నిటికంటే దారుణమైన విషయం ఏంటంటే.. కొన్ని టివి ఛానళ్లు ఆ వీడియోలను నిజానిజాలు తెలుసుకోకుండా ప్రసారం చేశాయి. రాసేముందు కనీసం అది నిజమా లేదా మార్ఫింగా అనే విషయం కూడా చూసుకోలేదు. ప్రస్తుతం ఎఐ వీడియోలు అందరినీ తప్పదోవ పట్టిస్తున్నాయి. నిజం కంటే వేగంగా అవే వైరల్ అవుతున్నాయి. ఇది గమనించాలని నా అభ్యర్థన. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు దాన్ని పరిశీలించాలని కోరుతున్నాను. వాస్తవాన్ని మాత్రమే ప్రజలకు అందించాలని మీడియాను విజ్ఞప్తి చేస్తున్నాను'' అని అక్షయ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారీ దొంగతనం.. 30 తులాల బంగారం చోరీ



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసుకున్న దుండగులు ఇంటి యజమానులు బయటకు వెళ్లి తిరిగి వచ్చేలోపు బీరువాలో ఉన్న బంగారు నగలు అపహరించారు. నాగారం ప్రాంతంలోని బ్రాహ్మణ కాలనీలో నివాసం ఉండే పవన్ శర్మ అనే వ్యక్తి సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పూజలు చేసేందుకు బయటకు వెళ్ళాడు. రాత్రి ఆయన తిరిగి వచ్చేలోపు ఇంటి తాళం ధ్వంసం చేసి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో అనుమానం కలిగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇంట్లోని బీరువా ధ్వంసం చేసి ఉండడంతో అందులో ఉన్న 30 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లుగా బాధితుడు పోలీసులతో తెలిపాడు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన సీఐ ఆధారాలు సేకరించేందుకు క్లూస్ టీం ను రప్పించారు. చోరీ విషయం తెలియడంతో నిజామాబాద్ సిసిఎస్ ఎసిపి నాగేంద్ర చారి ఘటనా స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఐదవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## భార్య చికెన్ వండలేదని ఉరేసుకున్న భర్త

భార్య చికెన్ వండలేదని భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్ల యర్రగొండపాలెం మండలంలో గోళ్లవిడిసిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఇంట్లో రోజూ పచ్చడి అన్నం పెడుతున్నదనదని ఇళ్ల లక్ష్మీనారాయణ (25) తన భార్యతో గొడవ పడ్డాడు. ఆదివారం కావడంతో చికెన్ తినాలని ఉందని చెప్పినా ఆమె వండకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో పొలానికి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇలాంటి ఘటనే సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని పోతారం గ్రామంలో జరిగింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దశరథ్ (40) అనే వ్యక్తి కుటుంబంతో పోతారం శివారులోని ఓ పౌల్ట్రీఫాంలో పనిచేస్తున్నాడు.